

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# ఇన్ లాస్ - అవుట్ లాస్

అదన్నమాట. అలా మనం రెణ్ణెల్లు గేపిచ్చి వొగ్గే టైటిల్ మరి టూమచ్చిగా లేదూ? ఐ నో. ఆఫ్ కోర్సు, ఆఫ్ కోర్సు. ఇంతకీ దీన్ని తెలుగులో చెప్పుకోవాలంటే "అత్తమామలూ – అడవి దొంగలూ" అనిన్నీ, అదే కన్నడంలో చెప్పుకోవాలంటే మరి..."అత్తె, మావై – అరణ్య కళ్ళై"అనిన్నీ..అబ్బే..ఎందుకులెండి, మనకి ఆట్టే టచ్చి లేదు, ఆనక ప్రణీతని కనుక్కొచ్చి చెబుతాను, అందాకా ఎడ్జెస్ట్ అయిపోండి. కాబట్టి, చెప్పొచ్చేదేవంటే పెళ్ళైన పెతీ మగాడిదకీ అత్తమావలుంటారు. అల్లాగే ఆడ లేడీస్ కీ వుంటారు. ఆడవాళ్ళ పేరెంట్స్ ని ఇన్ లాస్ అనీ, మగ పీనుగుల పేరెంట్స్ ని అవుట్ లాస్ అనీ ముద్దుగా పిలుకుంటారని ఈ మజ్జెనే వేగుల ద్వారా తెలిసింది. ఈ విషయం మీతో ఎప్పుడెప్పుడు, ఎప్పుడెప్పుడు చెబుదామా అని నేను గోళ్ళు కొరికేసుకుంటుంటే గోపిగాడొచ్చి వాడి గురించి రాయమని ఒహటే గోల. సరే ఏడవమన్నాను. ఏడ్చేసాడు, నేను రాసేశాను.

ఒక సెలవు రోజు ఉదయం కాఫీ తాగి, "ఇవాళ నాలిక గీసుకోకుండా కాఫీ తాగేసాను, ఇది బెడ్ కాఫీ కాదు, సోఫా కాఫీ" అని ఫేసు బుక్కులో నాలిక ఫొటో పెట్టేసి, ఎన్ని లైకులొచ్చాయో చూసుకుంటున్నాడు గోపి.

ఇంతలో వెనకాలనించి పదేళ్ళ పెద్ద కొడుకొచ్చి మొదలెట్టాడు "నాన్నా, ఇది చెప్పు. అడవిలో పుట్టింది, అడవిలో పెరిగింది, మాయింటికొచ్చింది, తైతక్క లాడింది, ఏమిటిది?" అన్నాడు పొడుపుకథ పొడుస్తూ.

"అదా, అదీ, అదీ, ఇంకెవరూ, మీ అమ్మ రా" అన్నాడు వాణ్ణి దగ్గిరకి తీసుకుంటూ.

"ఏవిటీ" అని అరుపు వినిపించింది సోఫా వెనకాతలనించి.

"ఓ, నువ్విక్కడే వున్నావా, ఇహ్హిహ్హిహ్హి, అదీ, అంటే, నాకు తెలీదు, మీ అమ్మని అడుగు అంటున్నానన్నమాట" అన్నాడు బిక్కు బిక్కు మంటూ.

"వాడమ్మ కాదు, వాడి నాయనమ్మ అయ్యుంటుంది, ఏది మళ్ళీ చెప్పండి" అని చీపురు కట్ట తీసుకుని దగ్గరకొచ్చింది.

దాన్ని చూసి "ఆ గుర్తొచ్చేసింది. అంటే కొండ చీపురుకట్ట అన్న మాట" అన్నాడు కొడుకుని డాలు లా అడ్డం పెట్టుకుంటూ.

గుంటడు ఈ కోలాహలం చూసి రెట్టించిన ఉత్సాహంతో రెచ్చిపోయాడు "అమ్మా, మరేం, ఇది చెప్పు. తోకలేని పిట్ట తొంభై ఆమడలు తిరిగింది".

"ఓస్ ఇదా, ఇది మీ శైలజ అత్త రా. ఒక్క క్షణం కాలు నిలవదు దానికి, మీ బాబు పోలికే చెల్లెలికీని..." అనేసి వంటింట్లోకెళిపోయింది.

చేసేది లేక చెవలాయిలా చూస్తూ నిట్టూర్చాడు గోపి. కాసేపటికి ఫేస్ బుక్ లో కరెంటు పోయింది, అంటే ఫోనులో చార్జి అయిపోయిందని అర్థం.

అప్పుడు చేతిలో వున్న దోశె పళ్ళెం పక్కనెట్టి, తీరిగ్గా కోపం తెచ్చుకుని "అయిందానికి కానిదానికీ మావాళ్ళని అంటే, జాటర్ ఢమాల్, అసలు వాళ్ళు ఇన్ లాస్ అన్న రెస్పెట్టే లేదు నీకు" అన్నాడు బుంగమూతెట్టి.

"వాళ్ళు కాదు,మీరే అసలు పెద్ద లాసు, వంకలేనమ్మ డొంకట్టుకేడ్చినట్టుంది. ఆ దోశె తో ఆపుతారా? ఆరోది కావాలా?" అంది ఆవిడ అట్లకాడ చూపిస్తూ.

"చాలు, ఇవాళ్నించీ ఐదే తింటాను. ఇది నా కఠోర నిర్ణయం హై, హే పంచ భూతమ్‌సే, హే దెయ్యమ్‌సే , హే పిల్ల రాక్షస్సే, అపి తు పంచాన్ దోశాన్ ఖాద్యామి, అహం" అన్నాడు గంభీరంగా. ఈ సంస్కృత ప్రజ్ఞ చూళ్ళేక, అసంస్కృత ప్రతిజ్ఞ వినలేక పిల్లలు జడుసుకుని పైకి పారిపోయారు.

పెళ్ళాం, పళ్ళెంలో దోశెల దొంతరేసుకుని తింటూ వచ్చి పక్కన కూచుంటూ అంది "ఇల్లాంటి పెతిజ్ఞలు చాలానే చూసాం గానీ, లంచికి ఏం వండాలో చెబితే, చెయ్యి కడుక్కున్నాకా ఆపనిలో పడతా" అంది నవ్వుతూ.

"అఖ్ఖర్లేదు, అసలు ఇవాళ ఏవీ వండఖ్ఖర్లేదు, కాదు కాదు ఇవాళ్టించీ నాకు ఏమీ వండఖ్ఖర్లేదు, ఇదే ఫైనలు" అన్నాడు గోపి కోపంగా.

"మరేంతింటారు, మీకు బంగాళదుంప బండ పచ్చడి తప్ప ఇంకేవీ రాదుకదా" అంది అనుమానంగా.

"రాకపోతే పోయింది, అదిగో ఆ చెట్టు ఆకులతో సలాడ్ చేసుకు తింటా" అన్నాడు కిటికీలోంచి బైట కనపడ్డ చెట్టుని చూపిస్తూ.

"తినండి, అది యే దిక్కుమాలిన పైన్ చెట్టో మరి. నోట్లో పెట్టుకోగానే పిచ్చెక్కడం ఖాయం" అంది నవ్వుతూనే.

"దుర్మార్గపుదానా, నేనింత బుసలు కొడుతూంటే, పుసుకూ పుసుకూ నవ్వుతావా, అసలు నేను ఆనాడే మా కాలేజీలో తెల్ల పంజాబీ పిల్లని చేసుకునుండవలసింది, మా అమ్మకూడా ఓకే అంది తెలుసా?" అన్నాడు బుంగమూతెట్టి.

"చేసుకోవలసింది, అందరికీ దూల తీరేది, పాచి పరోటాలు పీక్కోలేక. నాలుగు రకాలూ చేసి పెడుతూంటే మన వాల్యేషను తెలీట్లేదు ఎవడికీని" అంది వెటకారంగా.

"అది చెయ్యకపోతే పోయె, హాయిగా నెత్తికి రుమాలు కట్టేసుకుని వాళ్ళ గుడికెళిపోతే వాళ్ళేపెట్టేస్తారు లంగరో, లాంచీయో ఏదో అంటారు దాన్ని".

"అవును, ఎంతసేపు ఊరిమీద పడితిందావనే తప్ప కష్టపడి సంపాదిద్దావన్న సోయ వుంటేకదా, మా ఇంట్లో ఎవరికీ లేవమ్మా ఈ బుద్ధులు" అంది "మా ఇంట్లో" అనే మాట వత్తి పలుకుతూ.

"అద్దిగో మళ్ళీ" అంటూ ఇంతెత్తున లేచి, పోయి అవతల సోఫాలో కూలబడ్డాడు గోపి.

ఫోను మోగింది. ఓ చెయ్యి ఫోనెత్తి చెవికి ఆనించుకుంది.

అటు మొదలైంది " హలోనే, ఎలా వున్నావే. అన్నట్టు మీ అవుట్ లాస్ ఒస్తున్నార్టకదే. డీప్ కండోలెన్సెస్సే. అయినా అదేంటే, పెతీ ఐదేళ్ళకీ వచ్చేత్తారు మరీ ఇది గాను. చిరాకనుకో. వాళ్ళకి మనం చేసినవేవీ నచ్చవు. పోనీ బైటికి తీసికెళ్ళి పెట్టిదావన్నా, వాళ్ళేవన్నా మన అమ్మా నాన్నా నా? ఇంట్లో మొగుళ్ళకే తిండి దండగనుకుంటే, ఇంకా అత్తా, మావలకెక్కడపెడతావే? అనవసరపు ఖర్చు కదే. అయినా మా అవుట్లాస్ కి కితం సారిచ్చిన షాక్ ట్రీట్మెంట్ కి వారం రోజుల్లో పారిపోయారు తెలుసా? నువ్వేమో మాటలతోనే సరిపెడతావు. మళ్ళీ అన్నీ చేసిపెడతావు. అందుకే ఐదేళ్ళు తిరక్కుండా వాళ్ళు తయారు. మా పీనుగులు చూడు, కితం ఏడాది వచ్చారు, మళ్ళీ మరో ఇరవైయేళ్ళకి, మా పిల్ల పెళ్ళికొస్తారు. అదీ అప్పటికింకా వాళ్ళు పుటుక్కుమనకుండా వుంటే. అదేంటే నేనింత వాగుతుంటే, కుయ్యీ కయ్యీ మనవు?" అంది అనుమానంగా.

"వుండండి మా ఆవిణ్ణి పిలుస్తాను" అన్నాడు గుడ్లలో నిరుకుక్కుకుంటూ గోపి. అవతల ధబ్బుమన్న శబ్దం.

ఆనక "అంటే, నువ్వు.., ఐ మీన్.. మీరా గోపి గారు, నేను తనేమో..అని, అది, ఇహి..హి, అది ఎలాగంటే, ఏ ప్లస్ బీ హోల్ స్క్వేర్ నీళ్ళల్లో కలిపితే అర్కిమెడీస్ కదా, ట్వింకిల్ ట్వింకిల్ ఎస్ పాపా కదా అందుకే.." అంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడేస్తోంది.

"మీరు కాస్త ఆగితే, మా ఆవిణ్ణి పిలుస్తాను" అని ఫోనులోనే "ప్రియా" అని అరిచాడు గోపి.

ఓ నిమిషం గేపిచ్చి "హలో" అంది అటుగొంతు.

"హలో" అంది ఇటోగొంతు.

"హమ్మయ్య, వచ్చావా, నీ ఫోనులన్నీ ఎత్తుతాడేవిటే మీ శాల్తీ. పోనీ ఎత్తాడే అనుకో, ఎత్తి అలా బెల్లంకొట్టిన రాయిలా ఏవీ మాట్టాడ్డేవే, ముద్ద కుడువులాగ, ఎంత పెళ్ళైన మొగాడైతే మాత్రం, ఆర్నెల్లకోసారన్నా మాట్టాడాలిగా, మా శాల్తీని చూడు రోజూ పొద్దున్నే గుడ్ మార్నింగు, రాత్రి గుడ్ నైటు చెబుతాడు తెలుసా?.." అంది గబగబా.

"మా ఆవిడ ఇంకా మెట్లు దిగుతోందండి, ఏడవడం వల్ల నా గొంతు మోద్యులేషను మారి మీకు ఆవిడగొంతులా వినిపించింది" అన్నాడు గోపి ఏ భావమూ ప్రకటించకుండా.

"ఓ హ్హొ హ్హో, అదీ, ఆకాశంలో సముద్రం కదా, కమలం పువ్వులో కారప్పూసన్నమాట..." అంటూ మళ్ళీ పిచ్చి పిచ్చిగా మొదలెట్టింది. ఇంక వినే ఓపిక లేక పక్కకు పడిపోయాడు గోపి.

పెళ్ళాం వచ్చి ఫోనందుకుని "ఒసేయ్, గచ్చ పక్షీ, ముయ్యి, నేను నీకు చేస్తాలే, పెట్టేయ్." అనేసి ఆపు చేసేసింది. స్పృహతప్పిన గోపిని ఓమాటు కదిపి చూసింది. లాభం లేదు. కుదిపి చూసింది, ఫలితం లేదు.

తరవాత ఇంటర్నెట్ లో వెతికింది "అరగంట ముందు ఐదు దోసెలు తిని స్పృహ తప్పితే ఎంత సేపట్లో తెలివి వస్తుంది?" అని.

"మీరు మొహం మీద నీళ్ళు జల్లితే అరగంటలోను, జల్లకపోతే నాలుగ్గెంటలలోను" అని చెప్పింది ఇంటర్నెట్టు.

కాసేపు ఆలోచించి, వంటయ్యాకా లేస్తాడులే అని నీళ్ళు కొట్టకుండానే ఫోనుచ్చుకుని, పైకెళ్ళింది ప్రియ. పైకెళ్ళి తన ఫ్రెండు కి ఫోను చేసి "హమ్మయ్య, ఇప్పుడు చెప్పు" అంది ఉత్సాహంగా.

"మీ అమ్మ కన్యగా వున్నప్పటి పేరేవిటి" అడిగింది అవతలి గొంతు.

"ఏమయిందే నీకు" ? అంది ప్రియ.

"నువ్వు చిన్నప్పుడు వామన గుంటల్లో గెలిచినప్పుడు నీ స్కోరెంత?" మళ్ళీ అడిగింది అవతలి గొంతు.

"ఒసేయ్..." అరిచింది ప్రియ.

"నువ్వు మొట్టమొదటి సారి అట్లతద్ది వుయ్యాల ఊగిన చింతచెట్టుకి ఎన్నికాయలున్నాయి?" అవతలి గొంతు.

"ఛంపుతా పీనుగా, మాట్టాడతావా, ఫోను పెట్టేసేదా?" మళ్ళీ అరిచింది ప్రియ చివరి మాటగా.

"హమ్మయ్య, అగవే బాబు, ఇందాకణ్ణించీ రెండు సార్లు మీ ఆయనకి దొరికిపోయాను, అందుకే ఈసారి కంఫర్మ్ చేసుకుందావని మొదలెట్టానన్నమాట. ఇంతకీ మీ ఆయన వింటున్నాడా?" అంది అనుమానంగా.

"లేదే బాబు, మూర్ఛపోయాడు. మరో నాలుగ్గంటలదాకా భయంలేదు, చెప్పు చెప్పు.." అంది ప్రియ.

"ఏమీ లేదే, ఈసారన్నా నీకు నాలుగు చిట్కాలు చెబుదావని చేసానన్నమాట."

"చెప్పే బాబు, లేకపోతే, ప్రతీ ఐదేళ్ళకి చచ్చిపోతున్నాననుకో.." అంది ప్రియ నీరసంగా.

"అయితే విను. అవుట్ లాస్ వచ్చిన మొదటి రోజు వాళ్ళకి ఏంకావాలో అన్నీ చేసిపెట్టు. ఇంట్లో ఓ పాత చీర కట్టుకో, మొహానికి ఓ బొట్టెట్టుకో. తల ఓమాటు ఎగా దిగా దువ్వేసుకో. మర్నాడు పొద్దున్నే లేచి స్నానం చేసి దేవుడికో అగరత్తెలిగించి

"దేవుడా, వీళ్ళు త్వరగా వెళిపోయేట్టు చూడు" అని గెట్టిగా దణ్ణం పెట్టుకో. వీలైతే, వీళ్ళు త్వరగా వెళ్ళిపోతే ఓ అర్టిపండు నైవేద్యం పెడతానని మొక్కు. పిల్లల చేత కూడా మొక్కించు. వాళ్ళు ఏవేవి తింటారో, ఏవి తినరో అన్నీ వివరంగా కనుక్కుని, వాళ్ళు తిననివన్నీ కొని తెచ్చి ఫ్రిజ్జులో నింపు. సాయంకాలాలు ఇంటిల్లిపాదికీ సలాడ్లే పెట్టు. ఇలా నాలుగు రోజులు చెయ్యి. గుణం కనిపించకపోతే అయిదో రోజు ఉదయం కాఫీలో ఉప్పేసి ఇవ్వు. నూనె, నెయ్యి తగలకండా, నీళ్ళతో ఉప్మా చెయ్యి. నంచుకోవడానికి జీలకఱ్ఱ ఖారం వెయ్యి.

మగ అవుట్ లా చేత మూడు పూటలా వాకింగు చేయించు. చేస్తేనే గానీ మంచినీళ్ళీవ్వకు. ఆడ అవుట్ లా ని తీసుకెళ్ళి గుళ్ళో వదిలేసి, చీకటి పడ్డాకా తీసుకురా. ఇలా రెండ్రోజులు చేస్తే, వారం తిరిగేసరికి వాళ్ళే సొంత ఖర్చులమీద టిక్కెట్టు కోయించుకుని దుబాయి దాకా వెళ్ళి, అక్కడ్నుంచి ఆదరాబాదరాగా నడిచెళిపోతారు హైదరాబాదుకి. ఎక్స్పీరియెన్సు మీద చెబుతున్నాను. ఈ చిట్కాలు పనిచెయ్యకపోతే, ఎనిమిదోనాడు మాయింటికి భోయనానికి తీసుకురా. నేను చూసుకుంటాను. నా వంట తిని బతికి బట్టకట్టడానికి వాళ్ళేవీ మా ఆయన కాదు కదా, అన్నట్టుండవే, మా అమ్మ ఫేస్ బుక్కులో ఏదో మెసేజి పెట్టింది ఇప్పుడే...." అని ఓ సెకనాగి

"కె.....వ్వ్, మా అమ్మా నాన్న వాస్తున్నారుటే రెణ్ణెల్లల్లో. వాళ్ళని చూసి రెం...డు నెలలైపోయింది. ఎం...త బెంగ పెట్టేసుకున్నానో.... హమ్మయ్య, వాళ్ళొచ్చేస్తున్నారు. ఇంటికి రంగులేయించుకోవాలి, డెక్ మీద మంచి ఫర్నిచర్ కొనాలి, ఫ్రిజ్జు మార్చేసి కొత్తది కొనాలి, మా ఆయనకి బొజ్జ మరీ పెరిగిపోయింది, జాగింగు చేసి వాళ్ళొచ్చే సరికి తగ్గించుకోమనాలి, అన్ని రూముల్లోనూ రూం ఫ్రెష్నర్లు మార్చాలి, బాత్రూం లోకి స్పెషల్ కర్టెన్సు కొనాలి, మా పక్కింటివాడిని వాడి లాన్ కట్ చేసుకోమని చెప్పాలి, నీట్ గా లేకపోతే మా అమ్మకి అస్సలు నచ్చదే, ఈ సారి కనీసం ఫైవ్ మంత్స్ అన్నా వుండేట్టు చూసుకోవాలే, వుంటానే బోల్డు పని చేసుకోవాలి..." అని ఫోను పెట్టేసింది.

ఆ లంఖిణి చెప్పిన చిట్కాలన్నీ జాగ్రత్తగా ఓ క్రెడిట్ కార్డు కంపెనీ వాడి ఎన్వలప్పు కవరు వెనకాల రాసుకుని, వంటకెళ్ళింది ప్రియ. మూర్ఛనించి తేరుకున్నాకా పైకొచ్చాడు గోపి. మంచం పక్కనే వున్న ఆ నోట్సు చూసి, గుండె తరుక్కుపోయి "అమ్మా రావద్దూ, నువ్వూ బాబూ రావద్దూ, వచ్చినా కాఫీ తగద్దూ, ఆ ఉప్మా అసలే తినవద్దూ...అమ్మా..అమ్మా..బాబూ...బాబూ..." అంటూ పాపం పసివాడిలా పాడుతూ, ఈ సారి నిజంగానే మూర్ఛపోయాడు.

COMMENTS